# అనుబంధం

## తురగా (మోచర్ల) జయశ్యామల

అప్పుడే మగతగా పడుతున్న నిద్రలోంచి చటుక్కున మెలుకువ వచ్చింది కమలకి.

వీధి తలుపులు ఎవరో కొడుతున్నారు.

కమలలేచి, ముందుగదిలోకివచ్చి లైటువేసి టైము చూసింది. గోడగడియారంలో 10 30.

ఆ యింట్లో అందరికి 9.30 కల్లా పడకలు చేరడం అలవాటు. అందుకే అప్పుడే అందరూ నిద్రలోకి జారుకుంటున్నారు.

కమలవెళ్ళి వీధి తలుపులు తెరిచింది.

ఎదురుగా.... ఓ వృద్ధురాలు.... కొంచెంగా వంగిన నడుముతో, పూతగాపుచ్చుకున్న కర్ర ఓ చేతిలో.... ఓ చేతిలో పాతగుడ్డలమూటతో నెరసి ముగ్గుబుట్టలా వున్న తలతో ... ముడతలుపడిన శరీరంతో.... నిల్చుని వుంది.

ఆశ్చర్యపోయింది కమల

ఎవరో ఆ వృద్ధురాలు.... ఒకప్పుడు వయసులో చాలా అందంగా వుండేదనిపిస్తూంది. ఆమెను చూస్తూంటే.... అకాలంగా వృద్ధాప్యం మీద విరుచుకుపడినట్లుగా వుందామె. ఇంత రాత్రివేళ.... యిక్కడికు ఎక్కడ నుంచి వచ్చిందో.... ఎవరో....ఏమిటో.... ఎందుకో.

"ఆంటీ! ఈ ముసలామె మీ యిల్లు కావాలని అడిగింది. అందుకని తీసుకువచ్చాను నేను వెళుతున్నాను." అంతవరకు ఆ వృద్ధురాలి వెనుక నుంచున్న ఓ పన్నెండేళ్ళ కుర్రవాడు. ఆ వీధిలోనే రెండిళ్ళవతల తెలిసినవారబ్బాయి అయిన ఆ కుర్రవాడు కమలతోచెప్పేసి వెళ్ళిపోయాడు.

"అమ్మా! కమలమ్మా! లోపలికిరానామ్మా!" ఎంతదూరంనుంచో వచ్చిన అలసట ధ్వనిస్తుందా వృద్ధురాలిస్వరంలో.

ఆమె ఎవరో.... ఏమిటో తెలియకపోయినా ఆ వృద్ధురాలిమీద జాలితో "లోపలకు రండి!" అంది కమల అనాలోచితంగా.

కమల ఆ మాట అన్నదే తడవుగా. కర్ర తాటించుకుంటూ లోపలకు వచ్చిందామె

కమల వీధి తలుపులు దగ్గరకువేసి. వెనుతిరిగేంతలో ఆమె చేతిలో మూట. కర్ర నేలమీద పెట్టి. తనూ చతికిలబడుతూ. "కాసిని మంచినీళ్ళిద్దూ. కమలమ్మతల్లీ!" అనడిగింది.

అప్పటికే భర్తా. పిల్లలూ నిద్రపోయారు.

కమల మంచినీళ్ళు తేవడానికని లోపలికి వెళ్ళింది. ఆమెకు చాలా ఆశ్చర్యంగా వుంది ఆ వృద్ధురాలెవరో తనకి ఎంత ఆలోచించినా గుర్తుకావడంలేదు కాని, ఆమెకు తను బాగా తెలుసున్నట్లుగా, తనిల్లు వెతుక్కుంటూ వచ్చింది, తను బాగా పరిచయం వున్నట్లుగా చనువుగా పేరు పెట్టి పిలుస్తూంది. 'ఎవరు చెప్మా!' అనుకుంటూనే ఓ గ్లాసులో మంచి నీళ్లు తెచ్చి ఆమెకిచ్చింది కమల.

ఆ ముసలామె నీళ్ళు గడగడ త్రాగేసిగ్లాను క్రింద పెడుతూ "అమ్మయ్య ప్రాణం లేచి వచ్చింది తల్లీ!" అంది.

కమల జాలిగా చుసిందామెవైపు

మంచినీళ్ళు త్రాగడంతో కాస్త ప్రాణం లేచి వచ్చినట్లుగా రెండు నిమిషాలు కూర్చున్న ఆమె "తల్లీ! పొద్దుటినుంచీ ఏమీ తినలేదు. కాస్త తినడానికేమయినా వుంటే పెట్టు తల్లీ!" అంది.

ఆకలితో అలమటించిపోతున్నట్లు ఆమె అలా అడిగేసరికి కమల హృదయం ఆర్ద్రమైపోయింది ఆ ముసలామె ఎప్పుడు తిన్నదో. ఏమిటో. ఎక్కడ నుంచి వచ్చిందో. ఏమిటో ఆలోచిస్తూనే గబగబ వంటింట్లోకి నడిచింది.

మూతపెట్టి వుంచిన గిన్నెలన్నీ తీసి చూసింది సాయంత్రం భోజనాలయినాకకూడా. పచ్చడి అసలు మిగలలేదు కొంచెంగాపులుసు. గిన్నె అడుగున గుప్పెడు మెతుకులు మిగిలాయి. అవిచూడగానే వుసూరుమంది కమల ప్రాణం. ఆ మెతుకులతో ఆమె ఆకలితీరదు ఆ సంగతి తెల్సు కమలకి ఏం చెయ్యాలో తోచలేదు కమలకి. అప్పుడు ఎంత గ్యాసుమీద అన్నం వండాలన్నా పావుగంట తక్కువ పట్టదు. అంతవరకు ఆమెను ఆకలితో కూర్చోబెటడం యిష్టంలేకపోయింది కమలకి. అంతలోనే మెరుపులా ఓ ఆలోచన వచ్చింది. ఫ్రిజ్‌లో మూతపెట్టి వుంచినదోసెలపిండితీసి. అప్పటికిప్పుడు అయిదు నిముషాల్లో మూడు దోశెలువేసి. అవి, అన్నం ఒక ఆకులో వడ్డించి తీసుకు వచ్చింది కమల

ఆ ముసలామె అక్కడనుంచి కదలలేనట్లు అక్కడే కూర్చుని గాజుకళ్ళతో గదంతాకలయజూస్తోంది.

కమల విస్తరి ఆమెముందు పెట్టగానే ఆత్రంగా తినడంలో పడింది.

"అన్నం ఆ కొంచెమే మిగిలింది అందుకని దోశెలు వేసాను ఇంకా కావాలంటేవేసి పెడతాను:" అంది.

తినడంలో మునిగిపోయిన ఆమె 'అలాగే' అన్నట్లు తలాడించింది

ఆ ముసలామె తింటూవుంటే కమలఓసారి గదిలోకివెళ్ళి చూసి వచ్చింది భర్త. పిల్లలు మంచి నిద్రలో వున్నారు

తిరిగివచ్చి ఆముసలామె కెదురుగాసోఫాలో కూర్చుంది ఆమెనంక పరిశీలనగాచూస్తూ. అలా చూస్తున్న కమలకు హఠాత్తుగా అన్పించింది. ఆమెనెక్కడో. ఎప్పుడో చూసినట్లుగా

**ఆమె ఎంతో రుచిగా వంటచేయడం, శుచీశుభ్రంగా వుండడం, మాటలలో, చేతలలో మర్యాద, మప్పన కలిగి వుండడంలో ప్రసాదరావుగారు ఆమెని తమింట్లోనే పర్మినెంటుగా వుండిపొమ్మని చెప్పాడు. అప్పుడు నడివయసులో వుందామె. ఆమె అందం యింకా చెక్కుచెదరలేదు:**

ఆ ముఖం.... ఆకళ్ళు.... తనకు చిరపరిచిత మయినట్లుగా అన్పించి ఆశ్చర్యంగా చూస్తూండి పోయింది


ఆ దోశెలూ, అన్నమూ తిని తృప్తిగా త్రేన్చిందామె

"ఇంకో రెండు దోశెలు వేసి తెస్తాను' అంటూ లేచిపోయింది కమల.

ఆ ముసలామె కమల ముఖంలోకి విచిత్రంగా చూస్తూ, "అయ్యో! కమలమ్మ తల్లీ, నన్ను గుర్తుపట్టలేదా! ఇందాకటి నుంచి గుర్తుపట్టావనుకున్నాను ఎనిమిది గంటలకే యిక్కడ దిగాను అప్పటినుంచి మీయిల్లు వెతుక్కుంటూ వచ్చేసరికి రాత్రయింది!"

"ఊహూ మీరెవరో గుర్తురావడంలేదు"

"నిజమే తల్లీ! ఏడెనిమిది సంవత్సరాల క్రితం చూసావు అప్పటికి ఇప్పటికి నా రూపెంతో మారిపోయింది నేనమ్మా వసుంధరమ్మని...!"



"వద్దు తల్లీ! కడుపు నిండిపోయింది. ప్రాణం కాపాడావ్! చల్లగా వుండు నూరేళ్ళు!" కడుపునిండిన తృప్తితో సంతోషంగా అంది ఆమె "ఆకు యెక్కడ పారెయ్యాలి తల్లీ" ఎంగిలి విస్తరిమడుస్తూ అడిగిందామె.

చీకటిలో ఆ ముసలామె ఎక్కడికిపోయి పారేస్తుంది అందుకే కమల "నేను తీసేస్తాను లెండి. మీరు కూర్చోండి" అంటూ తనేవెళ్ళి ఆకుతీసి వీధిలోకి వెళ్ళి పారేసి, చెయి కడుక్కొనివచ్చి కూర్చుంది

ఆముసలామె అలాగే నిస్తాణగా కూర్చుండి పోయింది

"మీరు ఎక్కడ నుంచి వస్తున్నారు! ఎవరు మీరు- అంతవరకు ఎలాగో ఓగపట్టుకున్న సందేహాలను బయటపెట్టింది కమల

అయోమయంగా చూసింది కమల. "వసుంధరమ్మ వసుంధరమ్మా" గొణుక్కుంటున్నట్లుగా అనుకుంది "అవును .. వసుంధరమ్మ ఆ ముఖం.... కళ్ళు .. ఆ మాట.... అందుకే ఎక్కడో చూసినట్లుగా అన్పించింది వసుంధరమ్మ....' అనుకుంటూనే గత జ్ఞాపకాలలోకి వెళ్ళిపోయింది కమల

* * *

కాకినాడలో ప్రసాదరావు పేరు మోసిన లాయరు. ఆయన భార్య కాంతం. మొదటి నుంచి కూడా ఆమె జబ్బు మనిషి ధక్కా మొక్కీలకు ఆమె ఏ మాత్రం ఆగలేదు ఆ అనారోగ్యంతోనే ముగ్గురు పిల్లలు కలిగారు. ఆమెకు మూడు కాన్పులుకూడా కష్టమయ్యాయి ఆమెకు ఇద్దరు మొగపిల్లలు పెద్దవాళ్ళు తర్వాత ఆడపిల్ల.

భార్య ఎప్పుడూ అనారోగ్యంతో వుంటుంది, ఆమెచేత ఏ పనీ చేయనిచ్చేవారు కాదు ప్రసాదరావుగారు. పని మనుష్యులుండేవారు పై పనులు చేయడానికి. వంట చేయడానికికూడా ఓ మనిషిని పెట్టారు ఆ వంటామె ఒకప్పుడు బ్రతికిచెడిన మనిషి భర్త ఆకస్మిక మృత్యువాతపడితే, బతుకుతెరువుకోసం వంటలక్కగా చేరిందామె ఆమెకు ఒక కొడుకుండేవాడు. ఎందిరిళ్ళల్లోనో పండగలకి, తద్దినాలకి, పెళ్ళిళ్ళకి, పేరంటాలకి.... ఎన్నో రకాలుగా సహాయపడేది ఒళ్ళు దాచుకోకుండా కష్టించి పనిచేసేది. అందుకే ప్రతివాళ్ళు ఏమవసరమొచ్చినా ఆమెనే పిలిచేవారు.

అలాగే ఓసారి ప్రసాదరావుగారింట్లో వంట

చేయడానికి అవసరంగా వచ్చింది వసుంధరమ్మ. ఆమె ఎంతో రుచిగా వంటచేయడం, శుచీశుభ్రంగా వుండడం, మాటలలో, చేతలలో మర్యాద, మన్నన కలిగి వుండడంలో ప్రసాదరావుగారు ఆమెని తమింట్లోనే పర్మినెంటుగా వుండిపొమ్మని చెప్పాడు. అప్పుడు నడి వయసులో వుందామె. అయినా ఆమె అందం అప్పటికి యింకా చెక్కు చెదరలేదు. భార్య ఎలాగూ వంటా వార్పూ చెయ్యలేదు అనారోగ్యంతో. అందుకని ఆలోచించారాయన. కాంతంకూడా అందుకు ఒప్పుకుంది.

వసుంధరమ్మకు ఒక కొడుకుండేవాడు. వంటలుచేసి బ్రతుకుతూ ఆ కొడుకుని పోషించుకుంటూ, చదువు చెప్పించుకునేది. ప్రసాదరావుగారింటికి కొంచెం దగ్గర్లోనే ఓ చిన్నగది ఒకటి అద్దెకు తీసుకుని కొడుకుతో అక్కడుండేది. రెండుపూటలా వచ్చి, వంట చేసి అందరికీ వడ్డించి మిగిలినవి పట్టుకుపోయేది ఇంటికి.

అలా ఏళ్ళు గడిచాయి. ప్రసాదరావుగారి కొడుకులిద్దరూ, పెద్ద చదువులు చదివి, ఉద్యోగాలు సంపాదించుకున్నారు. ఉద్యోగాలు రావడంతోనే ఒక సంవత్సరం ఒక కొడుకుకి, మరో సంవత్సరం మరో కొడుక్కి పెళ్ళిళ్ళు చేశారు. ఉద్యోగరీత్యా దూరంగా చెరో చోటుకి వెళ్ళిపోయారు భార్యలతో. ఇంక ఇంట్లో మిగిలింది కాంతం, ప్రసాదరావుగారు, కమల.

కాంతం అనారోగ్యంతో తీసుకుని తీసుకుని కన్ను మూసింది.

తల్లి పోయేనాటికి కమలకి పద్నాలుగేళ్ళు. ఇంటర్ ఫస్టియర్ చదువుతూండేది. తల్లి పోయినప్పుడు వెంటా విడ వసుంధరమ్మ కమలని గుండెల్లో దాచుకుని ఓదార్చింది.

కాలం గడిచిపోసాగింది.

ప్రసాదరావుగారు కమలకి వివాహం చెయ్యాలని ప్రయత్నించసాగారు.

అయితే, తల్లి పోయిన రెండు సంవత్సరాలకి ఇంట్లో చాలా మార్పుని గమనించింది కమల.

యజమాని ప్రసాదరావు అంటే ఎంతో భయభక్తులతో వుండేది వసుంధరమ్మ. అతని ఎదురుపడి ఎక్కువగా మాట్లాడేది కాదు కాంతం బ్రతికున్నరోజుల్లో. అటువంటిది యిప్పుడు ఆయనతో నవ్వుతూ చనువుగా మాట్లాడుతూండడం గమనించింది కమల.

తండ్రి కూడా తల్లి బ్రతికున్న రోజుల్లో ఆవిడను సూటిగా చూసి ఎరుగడు. ఆయన కూడా ఇప్పుడు భోజనాలదగ్గర ఏవో చలోక్తులు విసురుతూండడం. దానికి వసుంధరమ్మ అవసరమయినా, అనవసరమయినా కూడా నవ్వుతూంది.

ఈ మార్పుకి కమల ముందు ఆశ్చర్యపోయింది. తర్వాత ఏదో భయంగా, మరేదో అనుమానంగా అనిపించింది.

మరో సంవత్సరం గడిచేసరికి తండ్రికీ, ఆమెకీ మధ్య వున్న అనుబంధం అర్థమైంది. కమల అప్పుడప్పుడే మనుషుల మనస్తత్వాలు, లోకంపోకడ, తీరుతెన్నులు అర్థంచేసుకుంటూంది. ఆ విషయం గ్రహించుకున్నాక ఏదో అర్థంగాని బాధతో రెండు మూడు రాత్రిళ్ళు కుమిలికుమిలి ఏడ్చింది తనలో తను. తండ్రి అన్నా, వసుంధరమ్మ అన్నా ఏదో అసహ్యం పేరుకుపోయింది మనసులో. వాళ్ళిద్దరి ముఖాలలోకి చూడడానికిగాని, మాట్లాడడానికిగాని ఇష్టం లేకుండా పోయింది. ఏదో జుగుప్స నిండుకుంది మనసులో. ఇది మంచి, ఇది చెడు అని నిశ్చయంగా ఆలోచించగల పరిజ్ఞానం కమలకి లేదు. కానీ, ఎక్కడో... ఏదో అన్యాయం జరిగిపోతోందనే బాధ.. మనసులో బాధ చెప్పుకోడానికి ఎవరూ లేరు. ఫ్రెండ్సుతో ఇటువంటి విషయాలు చెప్పుకోలేరెవరూ. వదినలు ఎంత మంచివాళ్ళయినా, తండ్రి గురించి చెడుగా వాళ్ళకి ఎలా చెప్పగలుగుతుంది. అన్నగార్లకి మాత్రం ఈ విషయం ఎలా రాస్తుంది తను. మింగలేక, కక్కలేక బాధపడిపోతూంది కమల.

ఇంత జరుగుతున్నా వసుంధరమ్మ కమలని ఆప్యాయతగానే చూసేది. ఆమెకు కావల్సినవన్నీ ఎప్పటికప్పుడు చక్కగా అమర్చేది. కానీ, కమలకిమాత్రం ఆమెను చూస్తే ఒంటిమీద తేళ్ళు, జెర్రులూ పాకుతున్నట్లుగా అనిపించేది. ఇంతకుముందు ఆమె అంటే వున్న గౌరవం, భక్తి మచ్చుకి కూడా లేకుండా పోయాయి కమలలో. చీటికీ మాటికి ఆమెమీద విసుక్కోవడం; ఆమె మాటలను, చేతలను విదిలించిపారెయ్యడం చేస్తోంది తనకు తెలియకుండానే.

అది సహజం. పెద్దవాళ్ళంటే, పెద్దరికం పోగొట్టుకోకుండా చిన్నవాళ్ళు తప్పు చేస్తున్నప్పుడు సరిదిద్దగలగాలి. ఆ పెద్దవాళ్ళే తప్పు చేస్తున్నప్పుడు చిన్నవాళ్ళ గౌరవాన్ని, మర్యాదని పొందలేరు. పైపెచ్చు వాళ్ళ దృష్టిలో హీనమైపోతారు.

కమల ఒక్కొక్కసారి తండ్రి గురించి, వసుంధరమ్మ గురించి తెగ ఆలోచించేది.




**దారి!**

ఆఫీసర్ ఆనందరావు దగ్గరకు వచ్చాడు క్లర్క్ ముకుందం.

"అయ్యా! నేను చాలా కష్టాలలో వున్నాను. మీరే నాకు దారి చూపించాలి...." అన్నాడు ముకుందం.

"అలాగే, తప్పకుండా.... ఈ దారి గుండా వెళితే నేరుగా బయటకు వెళతావు...."

ఐ. ఎ. విక్టర్‌బాబు (రాజమండ్రి)





## గంజి వైద్యం

"మీరు ఈ నెల అన్నం తినకూడదు. గంజి మాత్రమే తాగాలి" వరంధామయ్యకు సలహా ఇచ్చాడు డాక్టరు దామోదర్రావు.

"అయ్యా! తమరి ఫీజు చెల్లించాక కూడా ఈ నెల అన్నం ఎలా తినగల్ను! ఎలాగూ గంజే తాగాలి" అన్నాడు వరంధామయ్య.

-జి రామ్మూర్తి (పెదకాకాని)

తండ్రి తరపునుంచి చూసినా, వసుంధరమ్మ తరపునుంచి ఆలోచించినా వాళ్ళు చేస్తున్నది తప్పుకాదనిపించేది. అయితే ఆ వ్యవహారం పైకి రాకుండా జాగ్రత్తపడ్డారు ప్రసాదరావు, వసుంధరమ్మామ.

మరో ఆర్నెల్లు తిరిగేసరికి కమలకి మంచి సంబంధం కలిసిరావడంతో, వైభవంగా పెళ్ళి చేశారు ప్రసాదరావుగారు. కమలకూడా అత్తవారింటికి వెళ్ళిపోయాక ఆ ఇంట్లో ప్రసాదరావుగారు ఒక్కరే మిగిలారు. కమల తండ్రి గురించి చాలా బాధపడింది వెళ్ళేముందు. ప్రసాదరావుగారే ఆమెకి ఎంతో ధైర్యం చెప్పి పంపారు.

కమల భర్త గుడివాడలో కాలేజీ లెక్చరరుగా పని చేస్తున్నాడు. కమలని ఎంతో అపురూపంగా చూసుకునేవాడు అతను. ఇక్కడ ఎంత సుఖంగా వున్నా, తండ్రిని తలచుకున్నప్పుడల్లా మనసులో ఏదో బాధగానే వుండేది.

వివాహమయిన తర్వాత ఆరు నెలలకి కాకినాడ వెళ్ళింది కమల ఒకసారి. అప్పటికి వసుంధరమ్మ పూర్తిగా ఆ ఇంటి యిల్లాలుగా వ్యవహరిస్తోంది. అద్దెకున్న గది వదిలేసి పూర్తి మకాం యిక్కడికి మార్చేసింది. అప్పటికి ఆమె కొడుకు డిగ్రీ చదువుకి వచ్చేశాడు. ఊళ్ళోకూడా రకరకాలుగా చెప్పుకోసాగారు. కమలకు పుట్టింటికి వచ్చినట్లుగా అన్పించలేదు. ఎవరో పరాయివాళ్ళింటికి వచ్చినట్లుగా అన్పించి, మూడోరోజే తిరిగి గుడివాడ వచ్చేసింది

"అదేమిటి? పుట్టింటికి వెళ్ళినవాళ్ళకి నెలలు తరబడి వుండాలనిపిస్తుందే! మూడోరోజునే తిరిగి వచ్చేసావ్?" అన్నాడు కమల భర్త ఆశ్చర్యంగా.

"అవును! మిమ్మల్ని వదిలి వుండాలనిపించలేదు. అందుకని వచ్చేసాను!" అంది గోముగా.

తర్వాత రెండేళ్ళకి మొదటి కాన్పుకై కాకినాడ వెళ్ళింది కమల. అసలు ముందర వెళ్దామనుకోలేదు. గుడివాడలోనే వుండిపోదామనుకుంది. కాని, ఆమె పెద్ద వదినగారు రెండు నెలలు సెలవుమీద తామందరూ కాకినాడ వెళ్ళి వుంటున్నామని, డెలివరీకి అక్కడికే రమ్మనమని రాయడంతో వెళ్ళింది.

వసుంధరమ్మ తల్లికంటె ఎక్కువ ఆప్యాయంగా చూసింది- సేవలు చేసింది కమలకి. అయినా సరే కమల మనసులో ఆమె మీద మునుపటి గౌరవంరానేలేదు. పురుడు అయిన నెలరోజులలోనే తిరిగి వచ్చేసింది. రెండోసారి అసలు కాకినాడ వెళ్ళనేలేదు. మొదటిసారి కొడుకు ప్రశాంత్, రెండోసారి కూతురు సౌదామిని పుట్టారు. సౌదామిని నెలల పిల్లగా వున్నప్పుడే ప్రసాదరావుగారు పోయారు. అప్పుడు కమల, ఆమె భర్త వెళ్ళారు. వసుంధరమ్మ ప్రసాదరావుగారి మరణానికి చాలా బాధపడింది. ఆమె బాధచూస్తే కమలకినిజంగా చాలా ఆశ్చర్యమనిపించింది. అప్పటికి వసుంధరమ్మ కొడుకు ఉద్యోగం చేస్తున్నాడు. ఈ మధ్యనే పెళ్ళి కూడా చేసింది.

కమల అన్నగార్లిద్దరికి తలో వూళ్ళో ఉద్యోగాలు అవడంవల్ల, కాకినాడ ఇంటికి తాళం వేసి వెళ్ళారు. వసుంధరమ్మ తన కొడుకు దగ్గరకు వెళ్ళిపోయింది... ఇది జరిగి ఏడెనిమిది సంవత్సరాలవుతూంది. ఆ తర్వాతెప్పుడూ తను మరి వసుంధరమ్మను చూడలేదు. అప్పటికిప్పుడు.... ఈ వసుంధరమ్మ... !" కమల కళ్ళల్లో నీళ్ళు నిండాయి ఎందుకో

* * * *

"నాన్నగారు పోయాక నేను మా అబ్బాయి దగ్గరకు వెళ్ళిపోయాను తల్లీ! రెండుమూడేళ్ళు బాగానే గడిచిపోయాయి. తర్వాతే మొదలయ్యాయి తల్లీ నా కష్టాలు. అవును తల్లీ! నాన్నగారు నాకు కొంచెం ఆస్థి రాసిచ్చారు. నీకు తెల్సా?" అనడిగింది వసుంధరమ్మ.


విస్మయంగా చూసింది కమల

తండ్రి పోయిన రెండు సంవత్సరాలకి స్థిరచరాస్తులలో ఎవరి వాటా వాళ్ళు పంచుకున్నారు అన్నదమ్ములిద్దరూ. ఆ సంగతి కమలకు తెల్సు. అప్పుడే తండ్రి వసుంధరమ్మకు రాసిచ్చిన ఆస్థికూడా ఆమెకిచ్చేసారు వాళ్ళు న్యాయంగా. అన్నదమ్ములిద్దరూ ఆ విషయం ప్రత్యేకంగా కమలకి చెప్పలేదు.

'తెలీద'న్నట్టు తలూపింది కమల.

"ఆ ఆస్తికోసం తల్లీ! మా అబ్బాయిరోజూ నాతో గొడవ పెట్టుకునేవాడు. వాడు నాసడతని ఎప్పుడూ విమర్శించేవాడు. విసుక్కునేవాడు. అటువంటివాడు నా దగ్గరున్న ఆ డబ్బుకోసం రోజూ గొడవే ఏమిటో తల్లీ! ఈ డబ్బుంది చూసావూ! తల్లీ బిడ్డల మధ్య మమతనుకూడా చంపేస్తుంది....!"

కమల ఏమీ మాట్లాడలేక పోతూంది....! ఏమిటో ఈ వసుంధరమ్మలో ఎంత మార్పు వచ్చింది. అకాలంగా వృద్ధాప్యంమీద పడినట్లుగా వుంది. ఇప్పుడు ఇక్కడకెందుకు వచ్చినట్టు అసలు...." కమలకు ఆమె మీద కోపం అన్పించడంలేదిప్పుడు పైగా ఏదో జాలి



వేస్తూంధి

"ఏమిటోతల్లీ... కొడుకులని మురిసిపోవ డమేగాని, కూతుళ్ళే నయంతల్లీ...."

కమల మౌనంగా వింటూంది. వసుంధ రమ్మక్రింద కూర్చునేవుంది. ఆమెను అక్కడ నుంచి లేచి సోఫాలో కూర్చోమని చెప్పాలని అంతరాంతరాలలో ఎక్కడో కదులుతూంది. కాని. అనలేకపోయింది

"కమలమ్మతల్లీ! మా అబ్బాయి డబ్బు తీసుకొని ఇంట్లోంచి పొమ్మన్నాడు తల్లీ! ఈ వయసులో ఎవరున్నారని. ఎక్కడకనివెళ్ళను తల్లీ! వంటలు చేసే ఓపిక పోయిందమ్మా పనులు చెయ్యలేను చూపుకూడా ఎక్కువ ఆనడంలేదు. ఈ రెండుమూడేళ్ళుగా అక్కడిక్కడా వారాలు చేసుకొని, అడుక్కొని తిని కాలం వెళ్ళబుచ్చానమ్మా! ఎంతకాలం పెడతారు ఎవరు మాత్రం? తెలిసినాయన్ని ఒకాయన్ని బ్రతిమిలాడానమ్మా. గుడివాడకో టికెట్టు కొనిమ్మని. మీరు గుడివాడలో వున్నారని తెల్సి దయతలచి ఆయనో టికెట్టు కొనిచ్చాడమ్మా! నాకేం కావాలి తల్లీ! బ్రతికి నన్నాళ్ళు ప్రాణం కాపాడుకోడానికి గుప్పెడు మెతుకులు. మానం కాపాడుకోడానికి ఓ చింకి పాత గుడ్డ.... అంతకు మించి నాకేమీ భోగ భాగ్యాలక్కర్లేదు తల్లీ! ఆడపిల్లవు గుమ్మం లోకి వచ్చి అడిగితే కాదనవనే ఆశతో వచ్చాను...!" వసుంధరమ్మ కళ్ళల్లో. ముఖంలో ఏదో ఆశాకిరణం.


కమలకు అర్థమైపోయింది వసుంధరమ్మ ఎందుకు వచ్చిందో. తను తిప్పకుండా ఆదరిస్తాననే నమ్మకంతో వచ్చిందామె. ఎంత నమ్మకం ఆమెకి తనమీద కాని. వసుంధరమ్మ అంటే తనకున్న కోపం ఆమెకు తెలియంది కాదు తెలిసీ వచ్చిందంటే.... ఎంతాశతో వచ్చి వుండాలి.

ఇప్పుడేమిటి చెయ్యడం? ఎంతో ఆశతో వచ్చిన ఆ వృద్ధురాలను వుండమనాలా, లేక పొమ్మనాలా? వసుంధరమ్మను ఒకప్పుడు బాగా ద్వేషించిన మాట నిజం కాని. యిప్పుడామె మీద తనకే భావమూ లేదు. కాని.... కాని.... ఆమె బాధ్యత మీద పెట్టుకొని భరించేంత సహనం విశాల హృదయం తనలో వున్నాయా? కమల ఆలోచిస్తూనే వుంది.

"తల్లీ! నేను ఒక్కపూటే భోజనంచేస్తాను. అదికూడా కొంచెమే. నీకు పనికి ఏదైనా సహాయం కావాలంటే చెయ్యగలను ఏడాదికో పాత చీర ఇచ్చినా చాలు.... మీరు బయటకెళ్ళినప్పుడు యిల్లు కనిపెట్టుకొని వుంటాను...." వసుంధరమ్మ చెప్పుకు పోతూంది

ఆమె మాటలు వింటూంటే కమల మనసు కరిగిపోతూంది. 'నిజానికి వసుంధరమ్మ వున్నా పెద్ద ఖర్చంటూ లేకపోయినా, ఓ పెద్ద దిక్కుగా ఇంట్లో వుంటుంది కాని.... కాని... తను అంగీకరించగలదా? ఏమిటో' తల తిరిగి పోతున్నట్లుగా అన్పించసాగింది తను అంగీకరిస్తే భర్త ఏమీ అనరు ఆ సంగతి తనకు తెల్సు.... ఏమిటి చెయ్యడం?

"చూడండి. వసుంధరమ్మగారూ! ఉదయం నుంచి తిరిగి, తిరిగి మీరు అలసిపోయి వున్నారు. ఈ పూటకు పడుకోండి. మిగతా విషయాలు రేపొద్దున ఆలోచిద్దాం" అంటూ కమల ఆ గదిలోనే గోడవారగా ఓ మడత






రేటు

"ఏమయ్యా! ఇందాకా ఇడ్లీ ఇచ్చేటప్పుడు ఎనభై పైసలన్నావు మరి ఇప్పుడు నూట ఇరవై పైసలకు బిల్లిస్తున్నావేమిటి?" అడిగాడు అప్పారావు. సర్వ్వరాయుడ్ని.

"అది పావుగంట క్రితం రేటు సార్.... ఇప్పటి రేటది...." అన్నాడు సర్వ్వరాయుడు.

వెంటనే బిల్లు లాక్కుని కవుంటర్ దగ్గరకు పరిగెత్తాడు అప్పారావు గబగబా....

-పి బాబూరావు (విశాఖపట్నం)

మంచం వాల్చి పక్కవేసింది ఆమె కోసం.

"అలాగే తల్లీ! అలాగే!" అంటూ వసుంధరమ్మ ఆ మంచంమీద మెల్లగా మేను వాల్చింది. వెంటనే నిద్రపట్టేసిందామెకు.

గదిలో పడుకున్న కమలకు మాత్రం చాలా సేపు నిద్రపట్టలేదు. ఆలోచిస్తూనే వుంది ఏం చెయ్యాలా? అని. ఎప్పటికో ఒక నిర్ణయానికి వచ్చి నిద్రపోయింది.

మరునాడుదయం కమల భర్తకు వసుంధరమ్మను పరిచయంచేస్తూ "మా నాన్నగారి తరపున దూరపు చుట్టం ఈమె. ఒకప్పుడు బాగా బతికిన వాళ్ళు పరిస్థితులు తిరగబడితే కొన్నాళ్ళు వంటలు చేసుకుంటూ వుండేది. ఇప్పుడు కొడుకు యింట్లోంచి వెళ్ళిపొమ్మన్నాడట. నా మీద గంపెడంత ఆశ నమ్మకంతో రాత్రి పదిన్నర గంటలకి యిల్లు వెతుక్కుంటూ వచ్చింది. పాపం! పెద్దది. బ్రతికినన్నాళ్ళు బ్రతకబోతుందా ఏమిటి? మనకు మాత్రం రెండు పక్కల నుంచి పెద్ద దిక్కంటూ ఎవరూ లేరుకదా! అందుకని మనింట్లోనే వుండమన్నాను" అంది మీరేమంటారన్నట్లుగా.

"నువ్వు బాగా ఆలోచించకుండా ఏ పనీ చెయ్యవని నాకు తెల్సుకదా" అన్నాడు ఆమె భర్త.

కమల తేలికగా శ్వాస తీసుకొంది

ఏమిటో. ఈ అనుబంధాలకి అర్థాలేమిటో? ఎవరు వివరించి చెప్పగలరనిపిస్తూంది ఒక్కోసారి ఆలోచిస్తూంటే. ✱